క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సీఎస్ కె.సుబ్రహ్మణ్యం అనే దాత లక్షా 200 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున ఏఈవో పాలూరి నరసింగరావు దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

రేపు భువనేశ్వరీదేవికి అధివాస మహోత్సవం



దాబాగార్డెన్స్ : సబ్బవరం మండలం యాతపాలెంలో వెలసిన భువనేశ్వరీ దేవికి ఈనెల 4న అధివాస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు భువనేశ్వరీ పీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారికి పూజలు నిర్వహించే భక్తులు చీర జాకెట్టు, కుంకుమ తదితర పూజా సామగ్రితో విచ్చేసి పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: పద్మనాభపురం సబ్ స్టేషన్ బంటా కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలర్సర్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాల్లో ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గంటలో దొంగను పట్టుకున్న పోలీసులు



మహిళకు ఆభరణం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ : ఆటోలో ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాన్ని కొట్టేసిన వ్యక్తిని గంటలోనే పోలీసులు పట్టుకుని బాధితురాలికి నగ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం దొండపర్తి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లలితా జ్యుయలర్స్‌లో పావు తులం బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నగను కొట్టేశాడు. దీంతో ఆమె వెంటనే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్) వెంకటరత్నం పర్యవేక్షణలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంటలోనే ఆ వ్యక్తిని పట్టుకుని నగ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని సీపీ చేతుల మీదుగా బాధితురాలు వరలక్ష్మికి శుక్రవారం అందజేశారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు!



కలపాకలో మూత పడిన ఆర్వో ప్లాంటు

- తాగునీటికి ఇక్కట్లు
- ప్రైవేటు ప్లాంట్లే దిక్కు

పరవాడ: గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడానికి ఎన్టీపీసీ యాజమాన్యం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లు మూత పడ్డాయి. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, కలపాక, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఎన్టీపీసీ యాజమాన్యం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఆ ప్లాంట్లు మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కష్టాలతో సతమతమవుతున్నారు.

- వాడచీపురుపల్లిలో ఎన్టీపీసీ సింహాద్రి సీఎస్సార్ నిధులు రూ.7.50 లక్షల వ్యయంతో 2016లో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల పాటు పని చేంది. తర్వాత మరమ్మతులతో మూలకు చేరింది.



వాడచీపురుపల్లిలో మూత పడిన ఆర్వో ప్లాంటు

రిపేర్లతో మూలుగుతున్న ఆర్వో ప్లాంటును పంచాయతీ, ఎన్టీపీసీ యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఫలితంగా వాడచీపురుపల్లితో పాటు శివారు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల వద్ద తాగునీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

- కలపాక గ్రామంలో రూ.11 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటు కూడా మూలకు చేరడంతో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో ఆర్వో ప్లాంటు నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు పనికిరాకపోవడంతో ప్లాంటును తాత్కాలికంగా నిలిపివేశారు. తాగునీటి కోసం మైళ్ల దూరంలోని పరవాడ, వెన్నలపాలెంలోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్టీపీసీ సౌజన్యంతో గ్రామ సమీపంలో నిర్మించిన మంచి నీటి పథకం నుంచి ఆర్వో ప్లాంటుకు నీటిని సరఫరా చేసి తద్వారా ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు అందించాలని కోరుతున్నారు.



దేశపాత్రునిపాలెంలో తెరవని ఆర్వో ప్లాంటు

- దేశపాత్రునిపాలెంలో 2018లో రూ.11.63 లక్షల వ్యయంతో ఎన్టీపీసీ సింహాద్రి యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కూడా కొన్నేళ్ల నుంచి వినియోగానికి దూరంగా ఉంది. ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి 20 లీటర్ల నీటిని రూ.10కి కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు.

అధినేతతో..



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు

పరవాడ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయాన్ని చర్చించడానికి జిల్లా నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పైల పాల్గొన్నారు. 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజక వర్గంలో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని శ్రీనివాసరావు తెలిపారు.

80 మందికి క్యాన్సర్ పరీక్షలు



తాడిలో రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

పరవాడ: క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ నీలబాబు సూచించారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ సౌజన్యంతో తాడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చునని చెప్పారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.సుధానందర్ మాట్లాడుతూ క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు చేసుకోవడానికి యువత ముందుకు రావడం లేదని దీనిపై రాంకీ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో 80 మందికి క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, తాడి మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు కె.అచ్చిబాబు, ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ నదియా తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువుకు పోషకాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఉమ

పరవాడ: వాడచీపురుపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.ఉమా మాట్లాడుతూ నవజాత శిశువు జన్మించిన గంటలోపు తల్లి పాలు తాగించాలన్నారు. తల్లి పాల ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి లభిస్తాయన్నారు. తల్లి పాలు బిడ్డ శరీరం ఎదుగుదలకు, మెదడు అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లి గర్భాశయం స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. ఆర్నెల్ల వరకు తల్లి పాలు బిడ్డకు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జి.అమ్మాజీ, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



తహసీల్దార్ వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పెందుర్తి: పెందుర్తి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.వేణుగోపాల్‌ను మండల వైస్ ఎంపీపీ చిరికి దేముడు, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువాతో సత్కరించారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రామకృష్ణకీర్తి

పరవాడ: పశువుల షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ సబ్‌డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి పిలుపునిచ్చారు. స్థానిక పశుసంవర్ధశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణాలకు 70 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. పెంపకందార్లకు యూనిట్‌కు గరిష్టంగా రూ.60,900 నుంచి రూ.2,07000 లబ్ధి చేకూరుతుందని చెప్పారు. గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు వీలుగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు నిర్వహించే 21వ జాతీయ పశుగణనపై మార్గదర్శకాలపై ఏడీ రామకృష్ణకీర్తి అవగాహన కల్పించారు. సమీక్షా సమావేశంలో డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ అశ్వినిప్రపుల్లా, పశువైద్య సిబ్బంది కల్యాణి, శ్రీనివాస్, కృష్ణ, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్



లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

సబ్బవరం: లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తించి తగిన వైద్య సేవలు అందించడానికి సర్వే చేస్తున్నట్టు లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. దేవసాగర్ చెప్పారు. సబ్బవరంని సందర్శించి లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తించడానికి చేస్తున్న కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. లెప్రసీ సర్వే జరిగే గ్రామాలను సందర్శించడంతో పాటు సర్వేలో పాల్గొన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.సబ్బవరంలో గ్రామస్తులతో సంభాషించి లెప్రసీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ కార్యకర్తలు చేసే సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. లెప్రసీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పాత కేసులతో పాటు సస్పెక్టెడ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ లెప్రసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. సత్యవతి,లెప్రసీ ఎన్జీవో స్టేట్ కోర్డినేటర్ డాక్టర్ ప్రియదర్శిని,అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంవీఎస్‌కే బాలాజీ, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి,డాక్టర్ బి. ఆశ, సీహెచ్‌వో స్వర్ణలత,ఎంపీహెచ్‌ఈవో కె. జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో శునకాల బెడద



నాయుడుపాలెం వద్ద రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని గంగునాయుడుపాలెం, వెంకటపతిపాలెం, మెట్టపాలెం, బండారుపాలెం, పాత రాజన్నపాలెం శివారు గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను గాయాలపాల్జేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు కనబడిన కోళ్లను కూడా వదిలిపెట్టడం లేదని పల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల కారణంగా చీకటి పడితే రోడ్ల మీదకు రావాలంటే భయమేస్తుందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలో చెట్ల నరికివేత

పోలీసులకు ఫిర్యాదు



రాయపుర అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొట్టేసిన నేరేడు, వేప చెట్లు

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా ఉన్న నేరేడు,వేప తదితర చెట్లను కొంతమంది నరికేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ మంగళవారం స్కూల్ సమయం తర్వాత మండల కేంద్రంలో ఆర్జేడీ సమావేశానికి హాజరయ్యామని తెలిపారు.ఆ సాయంత్రం పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లను యంత్రాలతో కూల్చేశారన్నారు. విషయాన్ని సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు,స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ పిల్లల సాధుబాబుకు చెబితే విద్యార్థుల మీద కూలిపోతాయన్న ఉద్దేశంతో తామే చెట్లు కూల్చేసినట్లు చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఎంఈవో లక్ష్మణరావుకు తెలియజేసినట్టు చెప్పారు. కాగా ఎంఈవో లక్ష్మణరావును వివరణ కోరగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.విలువైన చెట్లను విక్రయించడానికే నరికేశారని గ్రామస్తులు చెబుతున్నారు.వారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఇలాగేనా

డీపీవో శిరీషా రాణి



సంపద తయారీ కేంద్రంలో చెత్త పేరుకుపోవడంతో సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో శిరీషారాణి

సబ్బవరం: స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్. శిరీషా రాణి మండలంలోని బాటజంగాలపాలెం, సబ్బవరం పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సబ్బవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చెత్తను కాపులుప్పాడలోని విద్యుత్ కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పనులను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో దోమలు విజృంభించకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. రక్షిత మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ ఎస్ఆర్పీ రాజేంద్రరావు

సబ్బవరం: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై శనివారం నుంచి ఈ నెల 12 తేదీ వరకూ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు స్టేట్ ఎస్ఆర్పీ రాజేంద్రరావు తెలిపారు.స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో పాటు సచివాలయ,పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీలను ఒక్కో గ్రామ పంచాయతీలో మూడు రోజుల చొప్పున నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అన్నిరకాల పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రామ్మోహనరావు చెప్పారు. రూ.14 కోట్లతో చేపట్టిన అన్ని రకాల పనులను డోర్ టు డోర్ తనిఖీచేసి వేతనదారులందరినీ కలిసి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీల బృందానికి సహకరించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మహేష్, మండల పరిషత్ ఏవో బాబూరావు, హౌసింగ్ ఏఈ శేఖర్ నాయుడు, పంచాయతీరాజ్ ఏఈ అర్జున అప్పారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే శాశ్వత పరిష్కారం

- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1268వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద ప్రసంగిస్తున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1268వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షలో బ్లాస్ట్‌ఫర్నేస్, సింటర్ ప్లాంట్, వాటర్ మేనేజ్‌మెంట్, ఈఎస్ఎఫ్ విభాగాలకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకులు లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నామన్నారు. తద్వారా ప్లాంట్ నష్టాల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు. సెయిల్‌లో విలీనానికి ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్ పూతి పోతయ్య రెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.ఎ.నాయుడు, బీఎఫ్ విభాగం నాయకులు పోలీసు నాయుడు, పాల అప్పలరెడ్డి, నల్ల రవి, పి.వి.నగేష్, ఈఎస్ఎఫ్ నాయకులు గొండేశి ప్రభాకరరెడ్డి, మింది దేవుడు, సింటర్ ప్లాంట్ నాయకులు డి.వి.కె.రాజు, కె.వి.రమణ, ఎం.పెంటారావు, వాటర్ మేనేజ్‌మెంట్ నాయకులు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, పూర్తి వివరాలకు జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

మారథాన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపావతి

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అటల్ మారథాన్ 2023-24లో సత్తా చాటారు.అటల్ ఇన్నోవేషన్ మిషన్,నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యుత్తమ 100 ప్రదర్శనల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైందని తెలిపారు. విద్యార్థులు జె. సందీప్,ఎల్ మున్నా,గైడ్ టీచర్ డాక్టర్ టి రాంబాబు,ప్రిన్సిపాల్ రామకృష్ణలను పాఠశాలలో శుక్రవారం గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రూపావతి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు,ఉపాధ్యాయులు జానకిరామ్,చిరంజీవిరావు తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రాను రాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



పాత రేసపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి గురునాథశర్మ, కమిటీ సభ్యులు ఆ.గురునాథ్‌రెడ్డి, బాచి, ఈశ్వరరావు, కోటి, ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్